నేడు ప్రజా ఫిర్యాదుల విభాగం

నిర్మల్ అర్బన్, నవంబర్ 24 : నిర్మల్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గ్రహించి తమ అర్జీలను అధికారులకు సమర్పించుకోవచ్చని సూచించారు.

ఆన్‌లైన్‌లో సర్వే వివరాలు నమోదు

ఇచ్చోడ, నవంబర్ 24 : ఇచ్చోడ, సిరికొండ మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఆదివారం కంప్యూటర్ ఆపరేటర్లు నమోదు చేస్తున్నారు. సిరికొండలో ఎంపీడీవో రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను తప్పులు లేకుండా ఫార్మట్ పద్ధతిలో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష

కడెం, నవంబర్ 24: లింగాపూర్ గ్రామంలోని జడ్పీ పాఠశాలకు చెందిన 42 మంది విద్యార్థులు ఖానాపూర్‌లోని బాలికల జడ్పీ పాఠశాలలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు హాజరైనట్లు ప్రధానోపాధ్యాయుడు బచ్చు వెంకటరమణ తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

కోర్టులో ఈ సేవా ప్రారంభం

ఉట్నూర్, నవంబర్ 23: ఉట్నూర్‌లోని జూనియర్ సివిల్ కోర్టులో ఏర్పాటు చేసిన ఈ సేవా కేంద్రాన్ని ఆదివారం జిల్లా జడ్జి ప్రభాకర్‌రావ్ ప్రారంభించారు. అంతకు ముందు కోర్టుకు వచ్చిన జిల్లా జడ్జికి స్థానిక న్యాయమూర్తి మౌనిక పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం ఫలికారు. కార్యక్రమంలో డీఎస్పీ నగేందర్‌గౌడ్, ఉట్నూర్ బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

ఉట్నూర్, నవంబర్ 23 : విద్యార్థులు చదువుపై దృష్టి సారిస్తూ, ఆరోగ్య సూత్రాలు పాటించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ సాధికారిత జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి, కోటేశ్వర్, ఆర్థిక అక్షరాస్యత నిపుణుడు నిఖిలేశ్వర్ సూచించారు. ఆదివారం ఉట్నూర్‌లోని కేజీబీవీలో విద్యార్థినులకు ఆరోగ్య పాఠశాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ ప్రవేశపెట్టిన ఆరోగ్య పాఠశాల ముఖ్య ఉద్దేశం, వ్యక్తిత్వ వికాసం గురించి వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ అధికారి ప్రియాంక, టీచర్లు సువర్ణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

అడెల్లి రోడ్డు గతి ఇంతేనా..?

- పూర్తికాని ఘాట్ రోడ్డు పనులు
- వాహనదారులకు తిప్పలు

రఘునాథ్‌పూర్ సమీపంలో దెబ్బతిన్న బీటీ రోడ్డు

ఘాట్ మలుపులో ఏర్పడిన గుంతల్లో నిలిచి ఉన్న నీరు

బోథ్, నవంబర్ 24 : బోథ్-నిర్మల్ ప్రాంతాల మధ్య దూరభారాన్ని తగ్గించేందుకు నిర్దేశించిన అడెల్లి రోడ్డు నిర్మాణ పనులు పూర్తికాక పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఘాట్ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రఘునాథ్‌పూర్ అటవీ ప్రాంతంలోని 11 నుంచి 17 కిలో మీటర్ల వరకు ఉన్న సుమారు ఆరు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2021-22 ఆర్థిక సంవత్సరంలో (నాబార్డు ఆర్ఐడీఎఫ్-ఎక్స్ఎక్స్‌వీఐ కింద) రూ.9.80 కోట్లు మంజూరు చేసింది. పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ ఘాట్ కటింగ్ పనులు పూర్తి చేశారు. రోడ్డుపై మట్టి, మొరం పోయించి తాత్కాలికంగా రాకపోకలకు వీలు కల్పించారు. ఘాట్ ప్రాంతంలో బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరుకాకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఏ కొద్ది పాటి వర్షం కురిసిన ఘాట్ ప్రాంతంలోని మట్టి రోడ్డు బురదమయంగా మారుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బీటీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పూర్తి చేయించాలని ఇరు ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. మరోవైపు ఖండిపల్లె నుంచి రఘునాథ్‌పూర్ అడవి వరకు నిర్మించిన బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. ఆటోలు, ద్విచక్రవాహనాలు, జీపులు తదితర వాహనదారులు దెబ్బతిన్న రోడ్డు మూలంగా అవస్థలు పడుతున్నారు. రోడ్డు విషయమై రోడ్లు, భవనాల శాఖ ఈఈ నర్సయ్యను సంప్రదించగా మిగిలిపోయిన మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం రూ 2.60 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఘాట్ ప్రాంతంలో 700 మీటర్ల పాటు సీసీ రోడ్లు, మిగిలిన 2.300 కిలోమీటర్ల బీటీ రోడ్డు కోసం ప్రతిపాదించామన్నారు. నిధులు విడుదల కాగానే టెండర్లు పిలిచి పనులు చేయిస్తామని తెలిపారు.

వెచ్చని నేస్తాలు

- రోజురోజుకు పెరుగుతున్న చలి తీవ్రత
- భైంసాలో ప్రారంభమైన ఉన్ని దుస్తుల అమ్మకాలు

ఉన్ని దుస్తులను విక్రయిస్తున్న వ్యాపారస్తులు

భైంసా, నవంబర్ 24 : రోజురోజుకు చలి తీవ్రత పెరిగిపోతోంది. చలిబారిన పడకుండా శరీరాన్ని ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు వెచ్చని ఉన్ని దుస్తులు ధరించడం పరిపాటి. శీతాకాలం వచ్చిందంటే చాలు చలికి రక్షణ ఉండే ఉన్ని దుస్తుల దుకాణాలు భైంసాలో వెలిశాయి. మధ్యప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు వచ్చి ఈ శీతాకాలం అంతా ఇక్కడ ఉన్ని వస్త్రాలు అమ్ముకుని వెళ్తారు. ప్రజలు కూడా చలిని తట్టుకునేందుకు రగ్గులు, స్వెట్టర్లు, మఫ్లర్‌లు, శాలువాలు, మంకీక్యాప్‌లు కొనుగోలు చేస్తుంటారు.

నాణ్యత, సైజ్‌ను బట్టి ధరలు

చలితో పాటు వర్షానికి తట్టుకునేలా, చిన్నారులు, యువత, మహిళలను ఆకట్టుకునేలా అనేక రుంగుల ఉన్ని దుస్తులు ప్రధాన కూడళ్లలో అమ్ముతున్నారు. వీటి ధరలు నాణ్యత, సైజ్‌ను బట్టి ధరలు ఉంటాయి. రూ.150 నుంచి రూ. వెయ్యి వరకు విక్రయిస్తున్నారు.

అమ్మకాల ప్రదేశాలు ఇవే...

భైంసాలోని మున్సిపల్ కాంప్లెక్స్ సమీపన, నిర్మల్‌కు వెళ్లే జాతీయ రహదారిపై వ్యాపారులు ఉన్ని దుస్తుల దుకాణాలు ఏర్పాటు చేశారు. రోడ్ల పక్కన తాత్కాలిక షెడ్లు వేసుకొని అమ్మకాలు సాగిస్తున్నారు. సుమారు 4 నెలల పాటు ఇక్కడే ఉండి వ్యాపారం చేస్తారు. ఆ తర్వాత స్వస్థలాలకు వెళ్లిపోతారు.

ఘనంగా ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం

ఎదులాపురం: మాట్లాడుతున్న ఎన్‌సీసీ లెఫ్టినెంట్ పుట్ట లక్ష్మణ్

ఎదులాపురం, నవంబర్ 24 : విద్యార్థుల్లో క్రమశిక్షణ. దేశభక్తిని పెంపొందించడానికి ఎన్‌సీసీ ఎంతగానో దోహదపడుతుందని ఎన్‌సీసీ లెఫ్టినెంట్ పుట్ట లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లో ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ లెఫ్టినెంట్ పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ ఉన్నత చదువులతో పాటు ఇతర అంశాల్లో ఎన్‌సీసీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అగ్నివీర్ పథకంలో ప్రాధాన్యత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పీఐ స్టాఫ్ బ్రజేశ్ కుమార్, హవల్దార్ ఆంజనేయులు, మనోజ్, కెడెట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో...

ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం కెడెట్ల చేత ప్రతిజ్ఞ చేయించి ఎన్‌సీసీ గేయాన్ని ఆలపించారు. అనంతరం కళాశాలలోని చెత్తాచెదారాన్ని ఏరివేశారు. మొక్కలు నాటి కళాశాల నుంచి ర్యాలీ తీశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతి, రఘు, ఎన్‌సీసీ కేర్ అధికారి చంద్రకాంత్, శ్రీనివాస్, కెడెట్లు పాల్గొన్నారు.

నిర్మల్ అర్బన్, నవంబర్ 24 : నిర్మల్‌లోని కస్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధికారులు ఎన్‌సీసీ ప్రాముఖ్యతను వివరించారు. ఎన్‌సీసీ కెడెట్లు చేపట్టిన విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం పట్టణ ప్రధాన వీధుల గుండా ర్యాలీ తీశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి సాయన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోన్, నవంబర్ 24: సోన్ మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో కెడెట్లు చేపట్టిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రశాంతి, ఎన్‌సీసీ అధికారి రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉట్నూర్ రూరల్, నవంబర్ 24: మండలంలోని లాల్‌టెక్టి గురుకుల బాలుర పాఠశాలలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిరాం, ఎన్‌సీసీ ఏఎన్‌వో మధురావు, వైస్ ప్రిన్సిపాల్ రామనాథం పాల్గొన్నారు.

ఆర్థికంగా మహిళలు రాణించాలి

సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో సాయివైకుంఠ ట్రస్ట్ చైర్మన్ రవికిరణ్ యాదవ్

ఎదులాపురం, నవంబర్ 24 : మహిళలు వృత్తి నైపుణ్యంతో ఆర్థికంగా ఎదగాలని సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మన్ రవికిరణ్ యాదవ్ అన్నారు. సాయివైకుంఠ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆదిలాబాద్‌లోని యోగ భవన్‌లో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో ఆడపిల్ల వృత్తి నైపుణ్యం నేర్చుకుంటే పోషణలో చేదోడు వాదోడుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నవీన్ యాదవ్, మసూద్, శిక్షకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఇచ్చోడ(సిరికొండ), నవంబర్ 24 : సిరికొండ మండలం కుంటగూడ, పాలవాగు గ్రామస్తులు ఆదివారం నేరడిగొండలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తమ గ్రామానికి వెళ్లేందుకు గ్రావెల్ రోడ్డు వేయించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చేశారన్నారు. మాజీ సర్పంచ్ పెంటన్న పాల్గొన్నారు.

ఇచ్చోడ: బోథ్ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

నాగోబాను దర్శించుకున్న జిల్లా జడ్జి

జిల్లా జడ్జి ప్రభాకర్‌రావ్‌కు నాగోబా ఫొటోను అందజేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, నవంబర్ 24 : కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా ఆలయంలో ఆదివారం జిల్లా జడ్జి ప్రభాకర్‌రావ్ ప్రత్యేక పూజలు చేశారు. నాగోబా ఆలయ చరిత్రతో పాటు జాతర, మెస్రం వంశీయుల సంస్కృతీ సంప్రదాయాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావ్‌కు నాగోబా ఫొటో అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కేస్లాపూర్ మాజీ సర్పంచ్ మెస్రం నాగ్‌నాథ్, ఉట్నూర్ డీఎస్పీ నగేందర్ గౌడ్, సీఐ మొగిలి, నాగోబా ఆలయ పూజారి మెస్రం షేకు, మెస్రం వంశీయులు నాగ్‌నాథ్, ఆనంద్‌రావ్, చిత్రు, నాయకులు ముకాడే ఉత్తమ్, నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన డీఈవో

లక్ష్మణచాంద: కిచెన్‌ను పరిశీలిస్తున్న నిర్మల్ డీఈవో రామారావు

నిర్మల్ అర్బన్, నవంబర్ 24 : నిర్మల్‌లోని జమేరాత్ పేట్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ పరీక్షా కేంద్రాన్ని ఆదివారం డీఈవో రామారావు సందర్శించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాయాలని, మాస్‌కాపింగ్ పాల్పడకుండా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట హెచ్ఎం రవిబాబు, ముఖ్య పర్యవేక్షకులు కిషన్, లింబాద్రి ఉన్నారు.

కేజీబీవీ తనిఖీ చేసిన డీఈవో

లక్ష్మణచాంద, నవంబర్ 24: లక్ష్మణచాందలోని కేజీబీవీని ఆదివారం నిర్మల్ డీఈవో రామారావు తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, స్టోర్‌రూం, వంట గదులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

BUSINESS OFFER

★సిబిల్ స్కోర్ పెంచబడును ఇంటి పై లోన్ / ఓపెన్ ప్లాట్ లోన్ / బిజినెస్ లోన్/పర్సనల్ లోన్ పెద్దపల్లి సంప్రదించవలసిన సెల్ నెంబర్ : 9346756075

NTK-325449

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆదిలాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677

మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలి

భైంసా: నినాదాలు చేస్తున్న మాల మహానాడు నాయకులు

భైంసా, నవంబర్ 24 : హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో డిసెంబర్ 1వ తేదీన నిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు తాలూకా అధ్యక్షుడు భీంరావ్ డొంగ్రే పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని బుద్ధవిహార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, మాలల ఐక్యత చాటేలా ప్రతి గ్రామం నుంచి కులస్తులు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాహుల్ దగ్డే, యశ్వంత్, గంగాధర్, భీంరావ్ చంద్రే, అంబేద్కర్, మాల సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, నవంబర్ 24 : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో ఏర్పాటు చేసే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ, భీం ఆర్మీ, భారతీయ బౌద్ధ మహాసభ నాయకులతో కలిసి పోస్టర్ విడుదల చేశారు. ముందుగా అంబేద్కర్ భవనంలో అంబేద్కర్, గౌతమ బుద్ధుడు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధానకార్యదర్శి వాగ్మారే కామ్‌రాజ్, మాల సంక్షేమ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు కాటం రమేశ్, మండలాధ్యక్షుడు రాజేశ్వర్, భారతీయ బౌద్ధ మహాసభ మండలాధ్యక్షుడు సంతోష్, భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు సందీప్, నాయకులు పాల్గొన్నారు.

తలమడుగు, నవంబర్ 24 : సుంకిడి గ్రామంలో మాల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సింహ గర్జన సభ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు రాఘవేంద్ర, రఘు, ప్రకాశ్, ప్రవీణ్, లింగన్న, మధుకర్ పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

యువకుడిని సన్మానిస్తున్న మాజీమంత్రి జోగు రామన్న

జైనథ్, నవంబర్ 24 : దీపాయిగూడ గ్రామానికి చెందిన శ్రీనివాస్-అనిత దంపతుల కుమారుడు ఆవుల నిఖిల్ వరుసగా రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినందుకు మాజీమంత్రి జోగు రామన్న అభినందనలు తెలిపారు. 2022లో రైల్వే గ్రూప్-డీ ఉద్యోగంతో పాటు గ్రూప్-4లో గ్రంథాలయ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా సాధించిన ఆయనను శాలువాతో సన్మానించారు.

గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యం

చెక్కు అందజేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

ముథోల్, నవంబర్ 24: గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఆదివారం బోరిగాం గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీకి రూ.60 లక్షలు, ముథోల్‌లోని సాయిమాధవ్ నగర్ కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలకు రూ. 40 లక్షలు మంజూరైన ప్రొసీడింగ్ కాపీలను నాయకులకు అందజేశారు. అనంతరం విట్టోలితండా గ్రామానికి చెందిన ఆనంద్‌కు సీఎంఆర్ఎఫ్ కింద రూ.26 వేలు మంజూరు కాగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజేశ్, బీజేపీ మండలాధ్యక్షుడు పోతన్న, నాయకులు, మాజీ ఎంపీటీసీ భూమేశ్ పాల్గొన్నారు.

పరామర్శ

విట్టోలి గ్రామానికి చెందిన కే లింగారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు, తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలో సత్తా చాటిన క్రీడాకారులు

ఎదులాపురం, నవంబర్ 24: రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ఐ బాక్సింగ్ పోటీలో ఆదిలాబాద్ జిల్లా క్రీడా పాఠశాల బాక్సింగ్ క్రీడాకారులు సత్తాచాటారు. ఆదివారం హైదరాబాద్‌లోని రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ లాలాగూడలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ఐ అండర్-14, 17 బాలబాలికల ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ఇందులో బీ నిఖిల్ 40-50 కేజీలో గోల్డ్ మెడల్, బీ ప్రవీణ్ కుమార్ 38-40 కేజీలో సిల్వర్ మెడల్, ప్రణవ్ 32-34 కేజీల్లో బ్రాంజ్ మెడల్, వెంకట్ వర్షిత్ 30-32 కేజీలో బ్రాంజ్ మెడల్ సాధించారు. డిసెంబర్‌లో 16 నుంచి 22వ తేదీల్లో ఢిల్లీలోని చత్రుశాల స్టేడియం, బాక్సింగ్ టోర్నమెంట్‌లో జరిగే జాతీయ స్థాయి ఎస్జీఎఫ్ఐ అండర్-14లో బంగారు పతకం సాధించిన క్రీడాకారుడు నిఖిల్ పాల్గొంటాడు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

నర్సాపూర్ (జీ), నవంబర్, 24 : మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం డీఆర్డీవో విజయలక్ష్మి పరిశీలించారు. ధాన్యం తేమ శాతాన్ని, సన్న రకం ధాన్యాన్ని గ్రెయిన్ క్యాలిపర్ డిజిటల్ మీటర్‌తో పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట సీసీ ముత్యం, మహిళా సంఘాల సభ్యురాలు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్.. తప్పిన ప్రమాదం

ఎదులాపురం, నవంబర్ 24: ఆదిలాబాద్‌లోని భుక్తాపూర్ 33 కేవీ సబ్ స్టేషన్ ప్రాంగణంలోని జేపీఈ గోడౌన్‌లో ఆదివారం ఉదయం షార్ట్ సర్క్యూట్ ద్వారా అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సబ్ కాంట్రాక్టర్ కేంద్రె శివ అక్కడికి చేరుకున్నారు. మంటలు అదుపులోకి రావడంతో పెద్ద నష్టం జరగలేదన్నారు. సబ్ కాంట్రాక్టర్ మాట్లాడుతూ ఎవరు లేని సమయంలో మంటలు చెలరేగాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్‌లో జరిగిన ప్రమాదంలో దాదాపు 20 నుంచి 25 వేల నష్టం వాటిల్లిందని తెలిపారు.

ఆదివాసీ ఉద్యమ నేత ఉయిక సంజీవ్ మృతి

ఉయిక సంజీవ్(ఫైల్)

ఎదులాపురం, నవంబర్ 24 : ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్(53) ఆదివారం ఉదయం మృతి చెందాడు. బేల మండలం సాంగ్వి గ్రామానికి చెందిన ఉయిక సంజీవ్ ఆదివాసీ గిరిజనుల హక్కుల కోసం, వారి సమస్య పరిష్కారానికి ఎన్నో ఉద్యమాలు చేశారని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

ప్రమాదవశాత్తు పడి ఒకరి మృతి

కుమ్ర సుభాష్(ఫైల్)

ఇంద్రవెల్లి, నవంబర్ 24: ఇంద్రవెల్లి మండలం ధనోరా(బీ) గ్రామానికి చెందిన కుమ్ర సుభాష్(48) ప్రమాదవశాత్తు మురుగు నాలిలో పడి మృతి చెందినట్లు ఏఎస్ఐ భీంరావ్ తెలిపారు. ఆదివారం ఏఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.... కుమ్ర సుభాష్ ఉదయం ఇంటి పనులు చేసి, బకెట్లతో నీళ్లు తీసుకువస్తుండగా ప్రమాదవశాత్తు మురుగు నాలిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చూడగా అప్పటికే ఆయన మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భీంరావ్ తెలిపారు.

డివిజన్ కమిటీ ఎన్నికకు సమావేశం

ఉట్నూర్ రూరల్, నవంబర్ 24 : ఉట్నూర్ మండలంలోని ఎక్స్‌రోడ్డులోని ఆదివాసీ పర్దాన్ సమాజ్ భవన్‌లో ఆదివారం ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాల ఆదివాసీ పర్దాన్ సమాజ్ పెద్దల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాత డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నికకు సమావేశం నిర్వహించామని పేర్కొన్నారు. డిసెంబర్ 15వ తేదీన నూతన డివిజన్ కమిటీ ఎన్నుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పెద్దలు దాదేరావ్, గోడం విశ్వనాథ్, మెస్రం గోవిందరావ్, భరత్, కేశవ్, దేవ్‌రావ్, నిరంజన్, రాందాస్, బాలాజీ, దత్తు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

యువత ఉన్నతంగా రాణించాలి

శృతిని సన్మానిస్తున్న ఎస్ఐ శంకర్

దస్తురాబాద్, నవంబర్ 24 : యువత చెడు వైపు వెళ్లకుండా ఉన్నతంగా రాణించి, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఎస్ఐ శంకర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన పిట్ల శృతి ఒకే సారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. గతంలో పోలీస్ ఉద్యోగానికి ఎంపిక కాగా, మళ్లీ గ్రూపు-4 లో ఎంపిక అయ్యారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆమెను ఎస్ఐ శంకర్ అభినందించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది రజిత, గ్రామస్తులు రాములు, రాజనర్సయ్య పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

ఖానాపూర్ టౌన్, నవంబర్ 24 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం నిర్మల్‌లో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన లేబర్ కోడ్‌ల రద్దు, భూసేకరణ 2013 అమలు, ఈజీఎస్